# గళంలోని గరళం

సరళ ఎక్కింది. రైలు కదిలింది. దారిలోనే పడేశాడు కూలీవాడు సామాను. పెట్టె, బెడ్డింగ్ కంపార్టుమెంటు లోపలిదాకా యీడ్చుకు వచ్చింది. హోల్డాలు విప్పి, లోపల్నించి ఒక దిండులాగి పైన పడేసి, చెప్పులు కింద విడిచింది. తాపీగా దిండు నానుకుని కూర్చుని ఎదురుగా చూసింది.

కంపార్టుమెంటు చాలా చిన్నది. తన తోటి ప్రయాణీకులెవరోనని. ఎదురుగా కూర్చున్న వాళ్ళ వంక పరీక్షగా చూసింది సరళ. ఇద్దరు ఆడవాళ్ళూ, తనూ మాత్రమే వున్నారు. ఆ కంపార్టుమెంటులో. ఒకావిడకి యాభైఏళ్ళు పైబడ్డాయి. రెండో ఆవిడకి ముప్ఫైఐదు ఏళ్ళు ఉంటాయి. వాళ్ళిద్దరూ అప్పాచెల్లెళ్ళు కావచ్చు, చిన్నావిడ ముఖం అందంగానే వుంది. ఆవిడ వంటినిండా నగలున్నాయి. ఖద్దరు సిల్కుచీరె కట్టుకంది. రెండో ఆవిడకి యింకా ఎక్కువగానే వున్నాయి నగలు. ఆవిడో గుంటూరు నేత జరీచీరె కట్టుకుంది. ఇద్దరూ కిటికీలోంచి బైటికి చూస్తున్నారు. సరళ చాలాసేపు వాళ్ళిద్దరి వంకా చూసింది. కాని వాళ్ళల్లో ఒక్కళ్ళు కూడా తలతిప్పి ఆమె వంక చూడలేదు. ఈ సంగతి కొద్దిగా నిరుత్సాహపరచిన మాట వాస్తవమే!

సరే, తలకాయ తిప్పేసి తను కూడా బైటికే చూడసాగింది సరళ. రైలు చాలా స్పీడుగా పోతోంది. రైలు కుదుపుకి మెల్లిగా లయతో వూగుతోంది సరళ శరీరం. సూర్యాస్తమయ సమయం. బయళ్ళు, దూరానున్న నీలి నీలి మబ్బులు అన్నీ సువర్ణ కాంతిమయంగా గోచరిస్తున్నాయి. కాని వాటి వంక చూస్తూ ఏదో వూహా ప్రపంచంలో మునిగిపోయేంత భావుకురాలు కాదు సరళ.

ఏం తోచక మళ్ళీ ఎదురుగా వున్న యిద్దరి వంక చూసింది. వాళ్ళల్లో పెద్దావిడ సరళ వంక ఒక్క క్షణం చూసి తల తిప్పేసుకుంది. సరళ తన వాచీ చూసుకుని, అనవసరంగా చేతినుంచి తీసి 'కీ' యిచ్చింది. ఈ మోతకి రెండో ఆవిడ తల తిప్పి సరళ వంక, ఆమె వాచీ వంక చూస్తూ కూచుంది చాలా సేపు.

సరళకి యీ చూపు కాస్త యిబ్బందిగానే వున్నా ఆనందంగానే వుంది. షిఫాను చీరె పమిట జారిపోతుంటే, నిండుగా కప్పుకుంది. ఆవిడ వంక చూడలేదు కానీ, ఆవిడ కళ్ళు తన మీద వున్నట్లు తెలుసు సరళకి. పమిట కొంగు మీద వున్న అందమైన ఎర్రడిజైను వంక చూసుకుంది ఓ మాటు. అప్రయత్నంగా ఎర్రరాళ్ళ ఉంగరాన్ని కుడిచేతి నుంచి ఎడమ చేతికి మార్చింది.

ప్రయాణంలో... అందులోనూ యింత చిన్న కంపార్టుమెంటులో యిద్దరు ముగ్గురే వుంటే సంభాషణ సాగితీరాలి. ఎవరో ఒకళ్ళు ముందు పలుకరించాలి. సాధారణంగా పెద్దవాళ్లు పలుకరిస్తారు చిన్న పిల్లలను.

పది నిముషాలు నిశ్శబ్దంగా సాగడమే అసంభవంగా, దుర్భరంగా వుంది సరళకి. అందులోనూ ఎదటి వారు తనవంకన్నా చూడడం లేదు. మహా యిబ్బంది పడిపోతున్నట్లుగా మొహం ముడుచుకుని, మెడవంచి ఓమాటు రాళ్ళనెక్లెసు సవరించుకుంది. ఒక పెద్ద నిట్టూర్పు విడిచింది.

సరళకి పదహారేళ్ళు. ఇంటరు రెండో సంవత్సరం చదువుతోంది. అది వాళ్ళ వూళ్ళో కాలేజీలో. స్నేహితులలో చాలా అబ్బురమైన విషయం. బంధువుల్లో అంతా ముక్కు మీద వేలేసుకునేవాళ్లే. "అప్పుడే ఎఫ్.ఏ.నా?" అని. అదో గర్వం సరళకి. ఎన్ని మాట్లో ప్రయాణాల్లో ఎవరో ఒకరు "ఏం చదువుతున్నావమ్మాయి" అని అడగడం, తను ఇంటరనగానే ఎంతో ఆశ్చర్యపడిపోవడం సరళ ఎరుగుంది.

కాని... ఈ ప్రయాణం ఏదో విరుద్ధంగా వుంది. మెల్లిగా మోచేతి మీద లేచి బెడ్డింగు లోంచి 'అగాథా క్రిష్టి' నవల ఒకటి తీసింది. ఆ మధ్య నాన్నగారు కొనిచ్చారది. మొదలెట్టి అర్థం కాక విసుగు పుట్టి మానేసింది. కాని యిప్పుడు తీయాల్సి వచ్చింది

ముఖానికడ్డంగా పుస్తకం పెట్టుకుని, దీక్షగా చదవసాగింది సరళ. ఆ ఆడవాళ్ళిద్దరూ తన వంక చూస్తున్న సంగతి ఆమె వెంటనే పసికట్టేసింది. మరింత దీక్షగా, వూపిరి బిగబట్టేసి గబగబ చదవసాగింది. "వీళ్ళు అడుగుతారింక తప్పదు. 'ఏవూరు వెడుతున్నావు'తో మొదలెట్టి, చదువు, తల్లిదండ్రులు, పెళ్ళి వివరం అన్నీ అడుగుతారు" చిన్న చిరునవ్వు వచ్చింది సరళ ముఖాన. పేజీ తిరగేసింది.

ఇంతకీ.... కిందటి పేజీలో ఒక్క ముక్క అర్థం కాలేదన్న సంగతి జ్ఞాపకం వచ్చింది సరళకి. పుస్తకం పేరేమిటి? అనుకుని అట్టవేపు చూసింది. 'మర్డర్ ఇన్ మెసమెపొటోమియా' అని చదివింది. ఇదేమిటని మళ్ళీ ఓ మాటు చూసింది. 'మెసపోటోమియా!' అని కూడబలుక్కుని చదివింది.

హఠాత్తుగా మాట్లాడ్డం మొదలు పెట్టారు సరళ ఎదురుగా కూర్చున్న వాళ్ళు.

"మీ గేదె యీనిందా?" అన్నది చిన్నావిడ.

"లేదు వదినా. పెరుగుకి చాలా యిబ్బంది పడిపోతున్నాము." సరే పల్లెటూరి సజ్జు అనుకుంది సరళ. మళ్లీ వాళ్ళ వంక చూస్తూ కూచుంది ఆమె.

ఒక్క నిముషమైనాక పెద్దావిడ పలుకరించింది. "మరి వదినా! సత్యానికి గుంటూరులో పని దొరికిందటగా!"

"ఔను. వాడి తల్లి అదృష్టమంతాను. పాపం. అష్టకష్టాలు పడి కడుపులో పెట్టుకుని పెంచిందావిడ. ఫలం దక్కింది. ఆవిడ సుఖపడుతుందిలే ఇంక" అంది చిన్నావిడ. నిర్లిప్తంగా సరళ పుస్తకం మీది బొమ్మవంక చూస్తూ.

"ఏం ఉద్యోగమో! గుంటూరులో, ఎండకాలంలో ఉంటే ప్రాణం కడగట్టి పోతుంది బాబూ" అంది పెద్దావిడ.

సరళ ఓపిక సన్నగిల్లుతోంది. వీళ్లు తోటి వాళ్ళతో మాట్లాడరేమిటి? సరళ అహం దెబ్బ తింటున్నట్లుగా వుంది. గిలగిలలాడి పోయింది సరళ.. తను యింటరు చదువుతున్నావనీ, సంగీతం బాగా వచ్చుననీ, తనకి ఎస్.ఎస్.ఎల్.సి.లో స్కూలు మొత్తం మీద ఫస్టుమార్కనీ ... చెప్పుకుందామని.

ఇంగ్లీషు పుస్తకం చదువుతోంది. రిష్టువాచీ పెట్టుకుంది. బూట్లు తొడుక్కుంది. ఖరీదైన చీరె, నగలు వున్నాయి. ఏదో ఒకటి అడగరేం. వాళ్ళల్లో వాళ్లు గొణక్కోకపోతే ఓ ప్రశ్న వేయరాదూ? బొత్తిగా ఆసక్తి లేదేం వీళ్ళకి? సరళకి అనవసరంగా కోపం వచ్చింది వాళ్లమీద. స్నేహాలు కలిపేసుకుని, టిఫిన్లు, కాఫీలు ఒకళ్ళ కొకళ్లు యిచ్చేసుకుని, అమాంతం ప్రాణం యిచ్చేటంతగా దగ్గరైపోతారు ప్రయాణాల్లో. గంటన్నర గడచినా, నాలుగు స్టేషన్లు దాటినా వీళ్ళకి ఎదురుగా కూచున్న అందమైన ఒంటరి చిన్నదాని సంగతి పట్టనే లేదు.

ఇద్దరి వంకా చూస్తూ కూచుంది. ఎంతసేపో ఆమె. వాళ్ళూ చూశారు గుడ్లెట్టుకుని. కానీ మాట్లాడలేదు. రైలు స్పీడు తగ్గుతోంది. స్టేషను వస్తోంది. ఉండబట్టలేకపోయింది సరళ. ఛీ! ఏం మనుష్యులు!

"ఏ వూరెడుతున్నారు?" అంది చిన్నావిడ వంక చూసి సరళ ఎంతో ఆత్రం ఆ ప్రశ్నలో.

"ఇక్కడే!" అంటూ ఆవిడ లేచి సంచీ చేత్తో పుచ్చుకుని, ఆవలించి చిటికె వేసింది. కుచ్చెళ్ళు సరి చేసుకుని తలుపు సమీపించారిద్దరూ. రైలు ఆగింది పెద్ద స్టేషన్లో. ఇద్దరూ దిగి, ప్లాటుఫారం దాటి మెట్లు యెక్కి బ్రిడ్డి మీద ఎక్కారు. సరళ కిటికీ దగ్గరకొచ్చి నడిచి పోతున్న వాళ్ళిద్దరి వంకా చూసింది. అల్లా నడిచి జనంలో కలిసి పోయి, కనుపించకుండా పోయారిద్దరూ.

సరళ మనస్సు అదోలా వుంది. వాళ్ళను కేకేసి 'ఏమండోయి! నేనింటరు చదువుతున్నాను. నాకు పదహారేళ్లే!' అని అరవాలనిపించింది. సరళ గొంతులో ఏదో వేదనలాగా బయలుదేరి, మింగినా లోపలికి పోక, ఏడుపుగా పైకి రాక మిగిలిపోయింది. రైలు కదిలింది.

**(1956)**